# రష్యాలోని భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని

జూలై 09, 2024

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు మాస్కోలో జరిగిన ఒక కార్యక్రమంలో రష్యాలోని భారతీయ సమాజంతో సంభాషించారు. ఆయనకు సంఘ సభ్యులు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలికారు.

2. భారతీయ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో, సాదర స్వాగతం పలికినందుకు ప్రధాని ప్రవాస భారతీయులకు కృతజ్ఞతలు తెలిపారు మరియు భారత్-రష్యా సంబంధాలను మెరుగుపరచడంలో వారి సహకారాన్ని ప్రశంసించారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, తన యొక్క చారిత్రాత్మక మూడవ పదవీ కాలంలో ప్రవాస భారతీయలని ఉద్దేశించి తన మొదటి ప్రసంగం కాబట్టి, ప్రవాస భారతీయుల సమాజంతో తన సంభాషణ ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.

3. గత పదేళ్లలో భారతదేశంలో కనిపించిన పరివర్తన గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. తన మూడవ పదవీ కాలంలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్న భారతదేశ ఆర్థిక వృద్ధి; దాని డిజిటల్ మరియు ఫిన్‌టెక్ విజయం; దాని పర్యావరణ మరియు సామాజిక ప్రభావాలను పరిగణించే అభివృద్ధి భావన యొక్క విజయాలు; మరియు సామాన్య ప్రజలను శక్తివంతం చేసే దాని యొక్క ప్రభావవంతమైన సామాజిక-ఆర్థిక కార్యక్రమాలు గురించి ఆయన మాట్లాడారు. 1.4 బిలియన్ల భారతీయుల అంకితభావం, నిబద్ధత మరియు సహకారం వల్ల భారతదేశం పరివర్తనాత్మక విజయం సాధించిందని, వారిలో ప్రతి ఒక్కరూ ఈ రోజున భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని కలలు కంటున్నారని ఆయన అన్నారు. తన యొక్క నిబద్ధతతో కూడిన ప్రయత్నాల ద్వారా, భారతదేశం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం నుండి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం వరకు, విశ్వబంధువు - ప్రపంచానికి మిత్రురాలిగా, ప్రపంచ శ్రేయస్సు కొరకు గణనీయమైన కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి శాంతి, చర్చలు మరియు దౌత్యం కోసం భారతదేశం యొక్క పిలుపు గట్టిగా ప్రతిధ్వనిస్తోందని ఆయన పేర్కొన్నారు.

4. రష్యాతో బలమైన మరియు ధృడమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడంలో చురుకైన పాత్రను కొనసాగించాలని ప్రధాని భారతీయ సమాజాన్ని ప్రోత్సహించారు. కజాన్ మరియు ఎకటెరిన్‌బర్గ్‌లలో రెండు కొత్త భారతీయ కాన్సులేట్‌లను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామని, ఇది ప్రజల మధ్య సంబంధాలను మరింత వృద్ధి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనికి శ్రోతలు గట్టిగా చప్పట్లు కొట్టారు. దేశంలో భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించడానికి మరియు పోషించడానికి మరియు దాని చైతన్యాన్ని రష్యన్ ప్రజలతో పంచుకోవడానికి ప్రవాస భారతీయ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

**మాస్కో**

**జూలై 09, 2024**